క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ కుబేర వ్రతం



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పాతబస్టాండు సమీపంలోని పాండురంగ స్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈశ్వరునికి పంచామృత అభిషేకం నిర్వహించారు. ధన త్రయోదశిపర్వదినం సందర్భంగా శ్రీ లక్ష్మీ కుబేర స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ సూక్త సంపుటిత మహాలక్ష్మీ మూలమంత్ర హోమం, మన్యు హక్షమం, రుద్ర హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. కార్య నిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఖాతాదారుల ప్రయోజనాలకు ప్రాధాన్యత



కెనరా బ్యాంక్ సత్రంపాడు శాఖను ప్రారంభిస్తున్న సర్కిల్ హెడ్ విజయలక్ష్మి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఖతాదారుల ప్రయోజనాలకు కెనరా బ్యాంక్ తొలిప్రాధాన్యత ఇస్తుందని కెనరా బ్యాంక్ సర్కిల్ హశ్రీడ్ సీజే విజయలక్ష్మి స్పష్టం చేశారు. స్థానిక సత్రంపాడులో కెనరా బ్యాంక్ నూతన శాఖను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాతాదారుల ప్రయోజనార్థం బ్యాంక్ విశిష్ట సేవలు అందిస్తోందని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీజనల్ హెడ్ తోట రవిచంద్ర మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో మరిన్ని శాఖలను ప్రారంభించాలనే లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. తక్కువ సమయంలో ఉన్నతమైన సేవలను అందించాలనే ప్రణాళికతో డిజిటల్, సాంకేతిక సేవలను పెంచుతున్నామని వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీ దివ్య గాయత్రి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం నవంబర్ 1వ తేదీన నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆపరేషన్, కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆటోనగర్, కొమడవోలు, తూర్పు లాకులు, సాయి నగర్ మాధవాపురం, పాలగూడెం, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

క్రికెట్ పోటీలకు రామశింగవరం విద్యార్థులు



ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఏలూరు రూరల్ : స్కూల్ గేమ్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు రామశింగవరం విద్యార్థులు ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టర్ జమ్మ రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. తణుకులో నిర్వహించిన అండర్–17 క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో తాడిగడప దిలీప్, పసుపులేటి వంశీ ప్రతిభ చాటి జట్టులో చోటు సాధించారని వివరించారు. రామశింగవరం పాఠశాలకు చెందిన కేతవరపు రాజశ్రీ, చలమల దివ్యశ్రీ, పారేపల్లి హర్ష, లక్ష్మీపావనతో పాటు తాడిగడప దిలీప్, పి.వంశీసాయి ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం అందుకున్నారని వివరించారు.

ఫ్లైఓవర్ నిర్వహణపై నిర్లక్ష్యం

- ఛిద్రమైన మెట్ల దారులు
- కూలిపోయిన రెయిలింగ్
- ఫుట్‌పాత్‌లపై ప్రజల అగచాట్లు
- మెట్ల దారి వద్ద షెల్టర్లు నిర్మించాలని కోరుతున్న ప్రజలు



ఆర్‌ఆర్‌పేట వైపు వెళ్లే మెట్ల దారి, ఇక్కడే షెల్టర్ కోరుతున్న ప్రజలు



ఆర్‌ఆర్‌పేట వైపు వెళ్లే మెట్ల మార్గంలో ధ్వంసమైన పిట్ట గోడ



రామకృష్ణాపురం వైపు వెళ్లే మెట్ల దారిలో ధ్వంసమైన సపోర్టు గోడ



జూట్‌మిల్లు సెంటర్ నుంచి ఫైర్‌స్టేషన్ వైపు వచ్చే మార్గంలో ధ్వంసమైన రెయిలింగ్

ఏలూరు (టూటౌన్): స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి జూట్‌మిల్లు సెంటర్ వరకు ఉన్న ఫ్లైఓవర్ నిర్వహణ గాలికి వదిలేశారు. ఈ బ్రిడ్జిపై నుంచి ఇటు రామకృష్ణాపురం వైపు, అటు ఆర్‌ఆర్‌పేట వైపు రాకపోకలు సాగించేందుకు వీలుగా నిర్మించిన మెట్ల దారి అధ్వానంగా మారింది. ఇరువైపులా మెట్లను కలుపుతూ ఉన్న బ్రిడ్జి గోడ పాడైపోయి ప్రమాదకరంగా మారింది. పలు చోట్ల బ్రిడ్జికి ఇరువైపులా నిర్మించిన రెయిలింగ్ గోడలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రాంతాల్లో పాదచారులు ఏమాత్రం ఆదమరిస్తే గాయాలపాలవక తప్పని పరిస్థితి ఉంది. ఈ బ్రిడ్జి కనీస మరమ్మతులకు కూడా నోచుకోవడంలేదు. ఈ బ్రిడ్జి క్రిందనే రోడ్లు భవనాల శాఖ ఏలూరు డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. నిత్యం అధికారులు రాకపోకలకు సాగిస్తున్నా ఫ్లైఓవర్ నిర్వహణను పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి.

షెల్టర్లు నిర్మించాలి

ఆర్‌ఆర్‌పేట ప్రాంతంలో ఆస్పత్రులు, పెద్దపెద్ద షాపింగ్ మాల్స్, వస్త్ర దుకాణాలు ఉన్నాయి. రోగులు, వ్యాపార సంస్థల్లో పనిచేసేవారు, వినియోగదారులు నిత్యం ఇటువైపుగా వెళ్లే బ్రిడ్జి మెట్ల మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో ఆర్టీసీ బస్సులు నిలుపుదల చేయకపోవడంతో ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ నిలువ నీడ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు పోస్టల్ కాలనీ, రామకృష్ణాపురం, మినీ బైపాస్ రోడ్డు వైపు ప్రజలు ఇటువైపు రావాలంటే ఇటు పక్కన ఉన్న మెట్ల దారినే వినియోగిస్తుంటారు. ఈ రెండు చోట్లా వేచి ఉండేందుకు వీలుగా షెల్టర్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

తరచుగా ప్రమాదాలు

మెట్ల దారిలో వెళ్లే ప్రాంతంలో ప్రారంభంలోనే రివిట్‌మెంట్ ధ్వంసమైంది. ఇనుప ఊచలు పైకి కన్పిస్తుండటంతో తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆదమరచి రాకపోకలు సాగిస్తే ధ్వంసమై ఖాళీలు ఏర్పడిన చోట కాలు పడితే ఇటు రైలు పట్టాల వైపు, అటు రోడ్డుపై జారిపోయే ప్రమాదం పొంచి ఉంది.

గోడను పునర్నిర్మించాలి



పనికోసం ప్రతిరోజు ఉదయం ఓవర్ బ్రిడ్జి పై మెట్ల దారిలో వెళ్లి వస్తుంటాను. మెట్ల దారి ఒక వైపు భారీగా ఖాళీ ఏర్పడింది. దీనిని గమనించకుండా వెళితే ప్రమాదం తప్పదు. రెండు వైపులా గమనించకుండా మెట్లు దిగితే అంతే సంగతులు. ధ్వంసమైన చోట గోడను పునర్నిర్మించాలి. నిత్యం వందలాది మంది కూలీలు ఈ మార్గంలో బ్రిడ్జి క్రిందికి వస్తుంటారు.

– ఎ.గంగాధరరావు, కార్పెంటర్, ఏలూరు వన్‌టౌన్

జాయింట్ల వద్ద మరమ్మతులు చేయాలి



నాకు ఆర్‌ఆర్‌పేటలో చిన్న కిళ్లీ కొట్టు ఉంది. ఉదయం కొట్టుకు వచ్చేటప్పుడు, రాత్రి ఇంటికి వెళ్లేటప్పుడు బ్రిడ్జిపై ఉన్న మెట్ల దారి గుండా రాకపోకలు సాగిస్తుంటాను. మెట్ల మార్గంలో అటూ ఇటూ కూడా జాయింట్లు ధ్వంసమై, అక్కడక్కడా పెచ్చులు ఊడిపోయి భయంకరంగా మారాయి. వీటి మరమ్మతులకు ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలి.

– బోయిన సాయినిర్మల, చిరు వ్యాపారి, ఏలూరు

షెల్టర్ నిర్మించాలి



ఆర్‌ఆర్‌పేటలోని ఒక షాపులో పనిచేస్తుంటాను. నిత్యం ఫ్లైఓవర్ మెట్ల మార్గం వద్ద దిగి పని చేసే చోటకు వెళ్లి వస్తుంటాను. ఈక్రమంలో బ్రిడ్జిపై ఆటో కోసం నిరీక్షించాల్సి వస్తుంది. అక్కడ నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్నాం. కనీసం మెట్ల మార్గం దగ్గరలో నీడనిచ్చే షెల్టర్‌ను నిర్మించాలి.

– వీవీవీఎస్ ప్రసాద్, ప్రైవేటు ఉద్యోగి, ఏలూరు

డిగ్రీ కళాశాలలో ఘనంగా ఏక్తా దివస్



ఐక్యతా ప్రతిజ్ఞ చేస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వతంత్ర భారతదేశ మొదటి హోమ్ శాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని ఏక్తా దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కళాశాల అభివృద్ధి ప్రణాళిక మండలి సభ్యులు ఎల్ వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వల్లభాయ్ పటేల్ భారత ఐక్యత కోసం చేసిన సేవను కొనియాడారు. ప్రిన్సిపాల్ జి.గిరిబాబు వల్లభాయ్ పటేల్ జీవితం యువతకు ఆదర్శమైనదన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. తొలుత వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణ చైతన్య, వి.వెంకటరావు, ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో విద్యార్థుల భవిష్యత్‌కు దెబ్బ



డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న సీఆర్‌ఆర్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ర్యాగింగ్‌తో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ అన్నారు. స్థానిక సీఆర్‌ఆర్ కళాశాల ఎంబీఏ, సీఐఐఈ, ఈడీసీ, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్, సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీ అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ మాట్లాడుతూ సీనియర్లు జూనియర్ విద్యార్థులపై పెత్తనం సాధించడానికి ఉపయోగిస్తోన్న ర్యాగింగ్ వల్ల భవిష్యత్ దెబ్బతింటుందని హెచ్చరించారు. మద్యం, గంజాయి, మాదకద్రవ్యాలు, బెట్టింగ్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాలను ఉపయోగించేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని వివరించారు. విద్యార్థులు ఎలా ప్రవర్తించాలో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు అవగాహన కల్పించారు. అనంతరం డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ సుబ్బారావులను సీఆర్‌ఆర్ కళాశాల యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, డైరెక్టర్లు వీఆర్‌ఎస్ బాబు యలమర్తి, రంగు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఏలూరు నగర శాఖ కార్యవర్గం ఎంపిక



పర్వీన్ బేగం



రాజారావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక యూటీఎఫ్ జిల్లా కేంద్ర కార్యాలయంలో ఏలూరు నగర శాఖ స్వర్ణోత్సవ మహాసభ నగర శాఖ అధ్యక్షురాలు షేక్ పర్వీన్ బేగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర శాఖ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షుడిగా ఎం చిట్టిబాబు, అధ్యక్షుడిగా షేక్ పర్వీన్ బేగం, ఉపాధ్యక్షుడిగా డి.దొరబాబు, పి.వాణి ప్రసన్న, ప్రధాన కార్యదర్శిగా రాజారావు జొన్నకూటి, కోశాధికారిగా కోరాడ కిరణ్ కుమార్ ఎంపికయ్యారు. ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రవికుమార్ హాజరయ్యారు. జిల్లా కోశాధికారి రంగమోహన్, జిల్లా ఆడిట్ కన్వీనర్ బంటు మోహన్ రావు, జిల్లా కార్యదర్శి ఈడే శివ శంకర్‌రావు హాజరయ్యారు. ఎన్నికల అధికారి బంటు మోహన్ రావు, పరిశీలికలు ఈడే శివశంకరరావు సమక్షంలో నూతన కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	38
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	23
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	29
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు - తిరుపతి	16.00	4830	26

యువతలో పెరిగిన సామాజిక బాధ్యత



ఏలూరు మార్కెట్‌యార్డులో చెత్త ఎత్తుతున్న విద్యార్థులు

ఏలూరు రూరల్ : యువతలో సామాజిక బాధ్యత పెరిగిందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికారి దూలం కిషోర్ అన్నారు. దివాళితో మైభారత్ కార్యక్రమం బుధవారం ఏలూరు మార్కెట్ యార్డ్‌లో నిర్వహించారు. ఎన్‌వైకే ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించిన సేవా కార్యక్రమం విజయవంతంగా సాగిందని కిషోర్ తెలిపారు. రోగులకు సేవలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రైతు బజార్లు చెత్త సేకరణ కార్యక్రమాల్లో కళాశాల యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారని కొనియాడారు. తొలుత మార్కెట్‌యార్డ్‌లో చెత్త సేకరణ చేపట్టి, పరిసరాల పరిశుభ్రం చేశారు.

టపాసుల సందడి



ఇండోర్ స్టేడియంలో బాణసంచా దుకాణాలు

ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన దీపావళి బాణసంచా దుకాణాల వద్ద సందడి నెలకొంది. బుధవారం పిల్లా పాపలతో వచ్చి తమకు కావాల్సిన టపాసులు కొంటున్నారు. గ్రౌండ్ మొత్తం బాణసంచా దుకాణాలు, వచ్చి పోయే వారితో కోలాహలంగా మారింది. గ్రౌండ్ బయట ఉన్న చిన్నారులు ఆడుకునే గన్‌లు, నెమలి పింఛాలు, మట్టి ప్రమిదలు వంటి దుకాణాలను ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



టపాసులు కొని తీసుకెళుతున్న కుటుంబం



కొనుగోలుదారులతో సందడి



ప్రమిదలు కొనుగోలు చేస్తూ

దీపావళికి ‘ధరా’ఘాతం

ఏలూరు (టూటౌన్): పెరిగిన ధరలతో నిత్యావసర వస్తువులు కొనలేని ప్రజలు దీపావళి టపాసులు కొని ఏ విధంగా పండుగ చేసుకుంటారని బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక స్ఫూర్తి భవన్‌లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంలో ప్రభుత్వం దీపావళి, సంక్రాంతి తదితర పండుగల సందర్భంగా పౌర సరఫరా శాఖ ద్వారా బెల్లం, మంచి నూనె, గోధుమ పిండి, శనగలు, పంచదార తదితర వస్తువుల్ని చౌకగా, ఉచితంగా ప్రజలకు ఇచ్చేదని గుర్తుచేశారు. నేడా పరిస్థితి లేకపోగా నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఆకాశాన్ని తాకుతోన్న పప్పులు, మంచి నూనె ఇతర నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలతో దీపావళి పండుగకు ప్రజలను దూరం చేసిన ప్రభుత్వ వైఖరిని ఆయన ఖండించారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం కేంద్రంలో, రాష్ట్రంలో అధికారులకు వస్తే పెరిగిన ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చి ధరలు మరింత పెరిగేందుకు ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని వెంకటేశ్వరరావు విమర్శించారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ



రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో) : స్థానిక కలెక్టరేట్‌లో ఉన్న ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్‌లు భద్రపరిచే గోడౌన్‌ను కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోదాము తాళాలు, సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలను పరిశీలించారు. సెక్యూరిటీ లాగ్ బుక్‌లో సంతకం చేశారు. ఇక్కడ పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కలెక్టర్ వెంట డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యాన్ని కల్లాల్లోనే కొనాలి



జేడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : రైతులు, కౌలు రైతులు పండించిన ధాన్యాన్ని కల్లాల్లోనే క్వాలిటీ నిర్ధారణ చేసి మిల్లర్లకు తరలించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నాయకులు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన్ని కలిసి వినతి పత్రం అందజేశారు. కౌలు రైతులకు, రైతులతో సంబంధం లేకుండా కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇప్పించాలని, కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని కోరారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకొనేందుకు టార్పాలిన్లు వ్యవసాయ శాఖ సరఫరా చేయాలన్నారు. జేడీని కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు గన్ను వెంకట్రావు, కార్యదర్శి దొంత కృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రైతు సంఘం జిల్లా నాయకులు వరప్రసాద్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

దెందులూరు: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని తహసీల్దార్ బి సుమతి అన్నారు. బుధవారం గోపన్నపాలెం సచివాలయంలో నిర్వహించిన సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా మెలగాలన్నారు. స్వేచ్ఛ సమానత్వం ప్రతి ఒక్కరి సొంతమన్నారు. టీడీపీ నేత మిల్లు బాబు, డీటీ కృష్ణస్వామి ఉన్నారు.